ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 తిరుపతి జిల్లా వార్తలు

సోమవారం 15 సెప్టెంబరు 2025

నేడు జిల్లాలో పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా జాతీయ మహిళా సాధికార సదస్సు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం జిల్లా, మండల కేం ద్రాల్లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

విజయవాడకు వెళ్లిన కలెక్టర్ : అమరావతిలో సోమ, మంగళవారాల్లో కలెక్టర్ల సదస్సు జరగనుంది. ఆ సదస్సులో పాల్గొనేందుకు ఆదివారం రాత్రి కలెక్టర్ వెంకటేశ్వర్ బయలుదేరి వెళ్లారు.









సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎంపీ పురందేశ్వరి, మంత్రి కేశవ్

మహిళా శక్తి.. దేశానికి ప్రగతి

● చారిత్రక ఘట్టానికి తిరుపతి అపూర్వ వేదిక ● నగరంలో తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సు



సదస్సు ప్రాంగణం వద్ద మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు

తిరుపతి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి.. జాతీయ మహిళా సాధికారత సదస్సుకు వేదికగా నిలిచింది. దేశనలుమూలలనుంచి మహిళా సాధికారత కమిటీ ప్రతినిధులు, పార్లమెంటు సభ్యులు వంటి ప్రముఖులు హాజరవడంతో తిరుపతి ఒక చారిత్రక ఘట్టానికి ఆతిథ్యమిచ్చింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నేతృత్వంలో 'వికసిత్ భారత్‌కు మహిళల నాయకత్వం' అనే నినాదంతో నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సు ఆదివారం రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభమైంది. చట్టసభల్లో మహిళా ప్రజాప్రతినిధులకు ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లు, ఇబ్బందులు.. వాటిని అధిగమించడంలో మహిళా సాధికారత పాత్రపై చర్చించారు. 'మన కుమార్తెలు చదువుకొని స్వయం ఆధారితులైతేనే భారతదేశం సమగ్ర, అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది' అని సదస్సును ప్రారంభించిన ఓం బిర్లా స్పష్టంచేశారు. గ్రామపంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు మహిళల ప్రాతినిధ్యం పెరగాలని సూచించారు. భారత రాజ్యాంగం మహిళల హక్కులకు బలమైన పునాదులు వేసిందని రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ నారాయణ్ సింగ్ అన్నారు. మహిళా స్వశక్తీకరణపై లోతైన చర్చలకు ఈ సదస్సు ముఖ్య వేదికగా నిలిచిందన్నారు. దివంగత సీఎం ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సగం భాగం ఇచ్చే చట్టం చేశారని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గుర్తుచేశారు. ఉద్యోగాల్లో, చదువుల్లో రిజర్వేషన్లు కల్పించారని, ప్రతిభా భారతి స్పీకర్‌గా నియమించడం ఒక చారిత్రాత్మక నిర్ణయమన్నారు. రాష్ట్రస్థాయి మహిళా సాధికారత కమిటీలను పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీతో కలిపి పవిత్ర క్షేత్రమైన తిరుపతిలో ఈ సమావేశం నిర్వహించడం చారిత్రాత్మకమైన ఘట్టమని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు పేర్కొన్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఒక మైలురాయి అని, అయితే భవిష్యత్తులో రిజర్వేషన్ల అవసరం లేకుండా మహిళలు 50శాతం కంటే ఎక్కువ ప్రాతినిధ్యం పొందే రోజు రావాలని తాను కోరుకుంటున్నానన్నారు. మహిళా నేతృత్వంలోని అభివృద్ధి భారతదేశ జాతీయ వ్యూహంలో ఒక ముఖ్యమైన అంశమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారని పార్లమెంటు మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విద్య, పారిశ్రామికత, ఆరోగ్యం, డిజిటల్ అక్షరాస్యత ద్వారా మహిళలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గృహ హింస చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం వంటి చట్టాలను సమర్థంగా అమలు చేయాలని కోరారు. మహిళలు, పిల్లల రక్షణ, దివ్యాంగుల సాధికారత, వయోవృద్ధుల భద్రత కోసం కలిసి పనిచేయాలని రాష్ట్ర మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ గౌరు చరితారెడ్డి పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు మహిళా సాధికారతకు పెద్ద పీట వేయడం,'డెవలప్మెంట్ నీడ్స్ ఉమెన్' నినాదంతో పరిపాలన చేస్తున్నారని ప్రశంసించారు. తల్లికి వందనం, దీపం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో పాటు పెన్షన్లు, ప్రసూతి సాయం, రైతు కేంద్రిత ప్రయోజనాలు మహిళలకు మేలు చేస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఏఐ, బయోటెక్నాలజీ, డిజిటల్ ఎకానమీలో మహిళలు వెనుకబడకూడదని తమ ప్రభుత్వం డిజిటల్ లిటరసీ, నైపుణ్యాధికార విద్య, క్వాంటం కంప్యూటింగ్ వంటి కొత్త నైపుణ్యాలలో పెట్టుబడులు పెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల డెలిగేట్లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు. కూటమి నేతలు పాల్గొన్నారు.



పురందేశ్వరికి జ్ఞాపిక బహూకరిస్తున్న స్పీకర్, డిప్యూటీ స్పీకర్, పక్కన గౌరు చరితారెడ్డి

చంద్రగిరి కోటలో అతిథులకు విందు





చంద్రగిరి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సదస్సుకు హాజరైన డెలిగేట్లకు చంద్రగిరి కోటలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదివారం రాత్రి విందు ఇచ్చారు. ఇందులో భాగంగా చంద్రగిరి కోట విశేషాలను తెలియజేసే సౌండ్ అండ్ లైట్ కార్యక్రమాన్ని సభ్యులకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కోట ఆవరణలో ప్రదర్శించిన కుంభకోయ, థింసా, గంగజాతర నృత్యం, కూచిపూడి నృత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అతిథులకు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భూమా అఖిలప్రియ, బొజ్జల సుధీర్‌రెడ్డి, గురజాల జగన్మోహన్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, తిరుపతి కమిషనరు మౌర్య, అసిస్టెంట్ కలెక్టర్ సందీప్ రఘువంశీ, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, టూరిజం టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, ఏపీ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, ఇతర అధికారులు సిబ్బంది, స్వాగతం పలికారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు.



చంద్రగిరి కోటలో లైటింగ్ షో, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న డెలిగేట్లు

వాతావరణం అనుకూలించక

సీఎం పర్యటన రద్దు

తిరుపతి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం ప్రారంభమైన మహిళా సాధికారత ప్రారంభ సమావేశానికి హాజరుకావాల్సిన సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన రద్దయింది.ఆదివారం ఉదయం చిరుజల్లులతో పాటు అమరావతి-తిరుపతి మార్గంలో ఆకాశం దట్టమైన మేఘాలతో నిండిపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రయాణం సురక్షితం కాదని ఏవియేషన్ అధికారులు సీఎం ప్రయాణానికి క్లియరెన్స్ ఇవ్వలేదు. దీంతో ఆయన పర్యటన చివరి నిమిషంలో రద్దయినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

నేటి ముగింపు సదస్సుకు గవర్నర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సోమవారం జరిగే జాతీయ మహిళా సాధికారత సదస్సు ముగింపు కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున డెలిగేట్లకు ఆయన మధ్యాహ్నం 12.30 గంటలకు ఆతిథ్య విందు ఇస్తారు. అనంతరం సదస్సుకు విచ్చేసిన ప్రతినిధులు ప్రత్యేక బస్సుల్లో శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనానికి వెళ్లనున్నారు. రాత్రికి వీరంతా రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. 7.30 గంటలకు డిప్యూటీస్పీకర్ రఘురామకృష్ణంరాజు ఆత్మీయ విందు ఇవ్వనున్నారు. మంగళవారం ఉదయం అల్పాహారం తీసుకుని అతిథులు తిరుగు ప్రయాణం కానున్నారు. కాగా, గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం ఉదయమే తిరుపతికి చేరుకున్నారు. కాగా, ప్రతినిధులు సోమవారం ఉదయం తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకోనున్నారు.

నేటి కార్యక్రమం ఇలా : ఉదయం 10.50 గంటలకు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిచే పలువురికి సత్కారం. 11గంటలకు రాష్ట్ర మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ గౌరు చరితారెడ్డి ప్రసంగం, 11.05గంటలకు పార్లమెంటు మమిళా సాధికారత చైర్‌పర్సన్ పురందేశ్వరి.. 11.10 స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. 11.15 గంటలకు రాజ్యసభ్య డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్.. 11.20కి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా.. 11.30గంటలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు. 11.40కి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ధన్యవాద తీర్మానం చేయనున్నారు.

కలెక్టర్‌కు ప్రశంసలు : డెలిగేట్లకు వసతి, బస ఏర్పాట్లు బాగున్నాయంటూ ముఖ్య అతిథులు, సభ్యులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా యంత్రాంగాన్ని ప్రశంసించారు.

డీఎస్సీ విజేతల జాబితా నేడు విడుదల

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను సోమవారం పాఠశాల విద్యాశాఖ ప్రకటించనుంది. అభ్యర్థుల పూర్తి వివరాలు కలెక్టర్, డీఈవో వెబ్‌సైట్లకు పంపనుంది.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 1478 నోటిఫైడ్ పోస్టులు భర్తీ చేయనుండగా వీటిలో ప్రభుత్వ, స్థానిక యాజమాన్యంలోనివి 1317 పోస్టులు కాగా, మున్సిపల్‌లో 64, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 97 పోస్టులు భర్తీ చేయనున్నారు.26,501 మంది అభ్యర్థుల నుంచి 45,221 దరఖాస్తులు రాగా వడపోతల తరువాత చివరికి 19,550 మంది పరీక్షలు రాశారు.అభ్యర్థుల టెట్ స్కోర్ (20శాతం), డీఎస్సీ స్కోర్ (80శాతం)లకు వెయిటేజ్‌తో మెరిట్ జాబితాలు రూపొందించారు. ఏడు రౌండ్లలో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరిగింది.ఎంపిక పరిధిలోకి వచ్చిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు మరోమారు విజయవాడ కేంద్రంగా జిల్లా విద్యాశాఖ అధికారులతో పరిశీలింపజేశారు. యాజమాన్యాల వారీగా, పోస్టుల వారీగా డీఎస్సీ విజేతల తుది ఎంపిక జాబితాను సోమవారం విడుదల చేయనున్నారు.

ఐఎంఎస్‌కు తొలి అడుగు పడింది


● త్రీడీ నమూనాను పరిశీలించిన సీఎం

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఇంట్రా మోడల్ బస్టాండు నిర్మాణానికి తొలి అడుగుపడింది. ఆదివారం సీఎం చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్మెంట్ లిమిటెడ్, ఏపీఎస్ ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఎన్‌హెచ్ఎల్ఎంఎల్ ప్రతినిధులు తాము రూపొందించిన త్రీడీ నమూనా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అందులో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్ టర్మినల్ నిర్మించాలని సీఎం వారికి సూచించారు. సకల సౌకర్యాలతో ఆకట్టుకునేలా ఉండాలని, హెలిపాడ్, రోప్‌వే సౌకర్యాల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు. భవిష్యత్తులో అన్ని ఎలక్ట్రిక్ బస్సులే నడిపే అవకాశమున్నందున విరివిగా ఛార్జింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

● 'డ్రగ్స్ ఫ్రీ తిరుపతి'గా మార్చడానికి కృషి

● ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సుబ్బరాయుడు



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతంలో పనిచేసిన అనుభవంతో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తానని ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు అన్నారు. తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఆయన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. రాహుల్ కన్వెన్షన్ హాలులో జరుగుతున్న జాతీయ మహిళా సాధికారత సదస్సుకు సంబంధించి భద్రతా పర్యవేక్షణలో బిజీగా గడిపారు. అనంతరం ఎస్పీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పురోహితులు ఆశీర్వచనాలు అందచేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. తమ సమస్యలపై నేరుగా సంబంధిత స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పటిష్ఠంగా అమలు చేస్తానన్నారు. విజుబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. దేశ, విదేశాల నుంచి తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు, బాలికలపై నేరాల నియంత్రణకు కృషి చేస్తానన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. తిరుపతితో పాటు జిల్లాను డ్రగ్స్ ఫ్రీగా మార్చడానికి పటిష్ఠ ప్రణాళికలను అమలు చేస్తామని సుబ్బరాయుడు చెప్పారు. గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. అనంతరం అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, వెంకట్రావు, నాగభూషణరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఎస్పీని కలిసి అభినందనలు తెలిపారు.

అయ్యో.. ఎంత బాధొచ్చిందో!

● పాకాలవారిపల్లె అటవీప్రాంతంలో రెండు మృతదేహాలు

● దంపతులుగా భావిస్తున్న పోలీసులు ● మరో ఇద్దరు పిల్లలను పూడ్చివేసినట్లు అనుమానం





దంపతులు ఆత్మహత్య చేసుకున్న ప్రాంతం - ఇక్కడే చిన్నారులను పూడ్చివేసినట్లు అనుమానం

చంద్రగిరి/ పాకాల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వాళ్లకు ఎంత బాధొచ్చిందో.. ఏమో! ఇద్దరు చెట్టుకు ఉరేసుకున్నారు. అక్కడి పరిస్థితులను బట్టి మరో ఇద్దరు పిల్లలను పూడ్చివేసినట్లు అనుమానిస్తున్నారు. వారం కిందట ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. చంద్రగిరి మండలం పాకాలవారిపల్లెకు రెండు కిలోమీటర్ల దూరంలోని మూలకోన అటవీప్రాంతంలో ఆదివారం సాయంత్రం గొర్రెల కాపరులకు దుర్వాసన రావడంతో మృతదేహాలున్న విషయం బయటపడింది. అటవీశాఖ, పాకాల సీఐ సుదర్శన్, పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాలు గుర్తు పట్టలేని విధంగా ఉన్నాయి. సంఘటనా స్థలంలో మద్యం, కూల్‌డ్రింక్ బాటిళ్లు, మాత్రలు, సెల్ ఫోన్ చార్జర్, చిన్న పిల్లల దుస్తులున్నాయి. అక్కడే రెండు గోతులు తీసి, ఎత్తుగా మట్టి కప్పి ఉండటం, ఆగోతులపై రెండు వరుసల రాళ్లు ఉండటంతో ఇద్దరు పిల్లలను పూడ్చి వేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. వీళ్లు వెళ్లేసరికే సాయంత్రం 6 గంటలు కావడంతో మృతదేహాలను పరిశీలించి వచ్చేశారు. ఈ అటవీ ప్రాంతంపై అవగాహన ఉన్న వాళ్ళే ఆత్మహత్య చేసుకొని ఉంటారని భావిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలు, లేదా ఇతర సమస్యలు కారణంగానే కుటుంబం ఆత్మహత్యకు పాల్పడి ఉందని అనుమానిస్తున్నారు. ఈ ప్రాంతం పరిధి చంద్రగిరా లేదా పాకాల మండలమా అని పోలీసులు తర్జన భర్జన పడుతున్నారు. అటవీ ప్రాంతం పరిధి మాత్రం పాకాల మండల రెవెన్యూ పరిధిలోకి వస్తుందని చంద్రగిరి పోలీసులు అంటే, పాకాలవారిపల్లె చంద్రగిరి మండలంలో ఉందని పాకాల పోలీసులు అంటున్నారు. సోమవారం ఉదయం మృతదేహాలను పరిశీలించి, గోతులు తవ్వి దర్యాప్తు చేపట్టనున్నారు.

బ్రహ్మోత్సవాలకు

కట్టుదిట్టమైన భద్రత

● ఆదేశించిన హోంమంత్రి



తిరుమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర హోంమంత్రి అనిత టీటీడీ విజిలెన్స్, జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. ఆదివారం తిరుమలలోని రచన గెస్ట్‌హౌస్‌లో టీటీడీ విజిలెన్స్ సీవీఎస్వో మురళీకృష్ణ, ఏఎస్పీ రామకృష్ణ, ఇతర అధికారులతో బ్రహ్మోత్సవ భద్రతాఏర్పాట్లపై సమీక్షించారు. ఇప్పటికే చేపట్టిన ఏర్పాట్ల గురించి అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తోపులాటలు, తొక్కిసలాటలు లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బందోబస్తు,ట్రాఫిక్ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని విజిలెన్స్, పోలీసు విధులు నిర్వహించాలన్నారు. భక్తులతో మర్యాదపూర్వకంగా మెలిగేలా సిబ్బందికి సూచనలు చేయాలన్నారు. ప్రతి కదలికలను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలన్నారు. సమీక్షలో డీఎస్పీ విజయ్‌శేఖర్, వీఎస్వోలు రామ్‌కుమార్, సురేంద్ర, సీఐలు విజయ్‌కుమార్, శ్రీరాముడు తదితరులు పాల్గొన్నారు.

మాధవమాలలో కొయ్య బొమ్మల రా మెటీరియల్ బ్యాంకు

ఏర్పేడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మాధవమాలలో కొయ్య బొమ్మల కళాకారులకు కావాల్సిన రా మెటీరియల్ బ్యాంకును త్వరలో ఏర్పాటు చేస్తామని ఏపీ ఫారెస్టు డెవలప్‌మెంట్ యాక్టివిటీస్ సలహాదారు మల్లికార్జునరావు తెలిపారు. మాధవమాలలోని బాలాజీ ఉడ్ కార్వింగ్ సొసైటీని ఆదివారం ఆయన సందర్శించారు. భాకరాపేట నుంచి తిరుపతికి ప్రధాన రహదారిని అటవీప్రాంతంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించే క్రమంలో.. ఆ దుంగలను మాధవమాలలో రా మెటీరియల్ బ్యాంకుగా స్టాక్ పెట్టనున్నట్లు తెలిపారు. వీటితో ఐదేళ్ల వరకు బొమ్మలు చేసుకోవడానికి సరిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో వివేక్, ఐఎఫ్ఎస్ సబ్ డీఎఫ్ నాగభూషణం, ఎఫ్ఆర్‌వో సుదర్శన్‌రెడ్డి, మాజీ డీఎఫ్‌వో కృష్ణయ్య రెడ్డి, శాండిల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవికుమార్‌రాజు, బాలాజీ ఉడ్ కార్వింగ్ సొసైటీ అధ్యక్షుడు రాజాచారి, సీఈవో కృష్ణమూర్తి, రెడ్ శాండిల్ అసోసియేషన్ మెంబర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి సాధికారత సోపానం

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం జాతీయ మహిళ సాధికారత సదస్సు ప్రారంభమైంది. రెండురోజుల పాటు జరిగే ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల చట్టసభల జాతీయ మహిళ సాధికారత సభ్యులు హాజరయ్యారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షత వహిస్తున్నారు. ఈ సందర్భంగా మహిళ సాధికారతపై సభ్యులు ఏమన్నారంటే...

మహిళా సాధికారతతోనే అభివృద్ధి



మహిళలు సర్వతోముఖాభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది. నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబునాయుడు మహిళా పక్షపాతులు. మహిళలకు ఆస్తిలో సగంవాటా, తిరుపతిలో పద్మావతి మహిళా యూనివర్శిటీ ఏర్పాటు లాంటి కార్యక్రమాలకు ఆనాడు దివంగత ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. ఆయన పంథాలోనే చంద్రబాబునాయుడు పదవుల్లో, ఉద్యోగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నారు. ఇలాంటి సదస్సులు వల్ల మహిళలు ఎదగడానికి అవకాశం ఉంటుంది.

- వంగలపూడి అనిత, రాష్ట్ర హోంమంత్రి

వంట గది నుంచి అంతరిక్షయానానికి



మహిళలు పూర్వపు రోజుల్లో వంట గదికే పరిమితమయ్యేవారు. నేడు అంతరిక్షానికి ప్రయాణించే స్థాయికి చేరుకున్నారు. అద్భుతమైన మైళ్లురాళ్లను అధిగమిస్తున్నారు. మహిళలు మరింత ముందంజ వేయడానికి సాధికార సదస్సు ఉపయోగపడుతుంది. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో మహిళల సాధికారత, సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది. 33శాతం రిజర్వేషన్లను తీసుకురానుంది.

-డీకే అరుణ, మహబూబ్‌నగర్ ఎంపీ,

ఫలప్రద చర్చలకు ఆస్కారం



మహిళలు అనేక రంగాల్లో రాణిస్తున్నారు. గ్రామీణ మహిళలు సైతం చట్టసభల్లో అడుగు పెడుతున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా దూరదృష్టితో మహిళల అభివృద్ధి కోసం తొలిసారిగా మహిళా సాధికార సదస్సు తిరుపతిలో నిర్వహించడం గర్వించదగ్గ విషయం.. సదస్సులో ఫలవంతమైన చర్చలు జరుగుతున్నాయి.

- సుధామూర్తి, రాజ్యసభ సభ్యురాలు, కర్ణాటక

మరింత సాధికారత అవసరం



స్త్రీ ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వావలంబన సాధించిన దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. దేశ జనాభాలో సగం ఉన్న మహిళలు మరిన్ని రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకోవాలి. మహిళ ఆర్థిక స్వావలంబన సాధించినపుడే కుటుంబం మెరుగైన స్థితికి చేరుకుంటుంది. ఇలాంటి సదస్సులు మహిళలకు ప్రయోజనకరం

- వరలక్ష్మి, చెంగల్పట్ ఎమ్మెల్యే, తమిళనాడు

విద్యతో వివక్షకు సమాధానం



ఏపీ ప్రభుత్వం జాతీయ మహిళా సాధికారత సదస్సుకు చేసిన ఏర్పాట్లు బాగున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి అభినందనీయం. బాల్య దశ నుంచే మహిళలపై వివక్షత కొనసాగకుండా ఉండాలంటే బాలికలకు మెరుగైన విద్య, వైద్యం అందించాలి. అన్ని రాష్ట్రాల్లో మహిళ హక్కులు కాపాడాలి. ఆర్థికంగా ఎదగడానికి చేయూతనందించాలి.

- కరెమ్మ నాయక్, దేవదుర్గ ఎమ్మెల్యే, కర్ణాటక

33శాతం రిజర్వేషన్ కల్పిస్తే సత్తా చాటుతాం



రాష్ట్రంలో మహిళాభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి అమోఘం. ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలయితే సర్పంచ్ నుంచి పార్లమెంటు వరకు సత్తా చాటుతారు. పనిచేసే చోట ఇప్పటికీ మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటివి జరగకుండా రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురావాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తున్న ఈ జాతీయ సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉంది

- పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే

చంద్రబాబు స్ఫూర్తితో రాజకీయాల్లోకి...



మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధిపై చర్చకు తొలిసారి సాధికార సదస్సు తిరుపతిలో నిర్వహించడం సంతోషంగా ఉంది. మా అమ్మ శోభా నాగిరెడ్డి చంద్రబాబు స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని రాజకీయాల్లో వచ్చాను. మహిళలకు చట్టసభల్లో అవకాశం వస్తే సమాజం అభివృద్ధి చెందుతుందనేది చంద్రబాబు విశ్వాసం.

- భూమా అఖిలప్రియ, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రతి రాష్ట్రంలో ఇలాంటి జాతీయ సదస్సు నిర్వహించాలి. అన్ని రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం వహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా అంగన్‌వాడీలను పరిపుష్టి చేసి బాలికలకు మెరుగైన విద్యను అందించాలి. బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉంది.

- ఎన్‌హెచ్ కోనరెడ్డి, కర్ణాటక మహిళ సాధికార కమిటీ చైర్మన్

సదస్సు నిర్ణయాలతో సాధికారతకు బాట



మహిళా సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యం కృషి చేస్తున్నాయి. నాడు ఎన్టీఆర్ బాటలోనే నేడు సీఎం చంద్రబాబు మహిళాలోకం గర్వించదగ్గ స్థాయిలో పనిచేస్తున్నారు. ఐటీ రంగంలో కూడా మహిళలే ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారు. ఇందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ సదస్సు చర్చించి తీసుకునే నిర్ణయాలతో మహిళా సాధికారత అమలుకు అవకాశం కలుగుతుంది.

- పయ్యావుల కేశవ్, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి

లక్ష్మీనారాయణ స్వామి సేవలో ఓంబిర్లా



స్పీకర్‌ను సత్కరిస్తున్న గురవానంద గురూజీ

రామచంద్రాపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రామాపురం బ్రహ్మర్షి పీఠంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామివారిని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. పీఠం పీఠాధిపతి గురవానందగూరుజీ, నిర్వాహకులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. లక్ష్మీనారాయణస్వామి, జైన్ ఆలయాల పూజల్లో ఓంబిర్లా పాల్గొన్నారు. స్పీకర్‌ను శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి

స్పీకర్లను కలసిన బీజేపీ నేతలు



తిరుపతి రూరల్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుపతి వేదికగా జరుగుతున్న జాతీయ మహిళా సాధికార సదస్సుకు హాజరైన లోకసభ స్పీకర్ ఓంబిర్లా, ఏపీశాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడులను బీజేపీ జిల్లా కమిటీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలశారు. వీరిని దుశ్శాలువాతో సత్కరించారు. టీటీడీ బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, మాజీ ప్రధానకార్యదర్శి వరప్రసాద్, సీనియర్ నాయకులు పొనగంటి భాస్కర్, తిరుపతి అసెంబ్లీ కోకన్వీనర్ నాదముని, ప్రధానకార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షులు ప్రశాంతిరాజు, దీపక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వెండి, బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

చంద్రగిరి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంత్ నగర్‌లో చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు అబ్దుల్ నజీర్ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా రిటైరై ప్రస్తుతం హెచ్‌డీఎఫ్ బ్యాంక్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. ఈయన, కుటుంబసభ్యులు శనివారం పాకాలకు వెళ్ళి ఆదివారం తిరిగి వచ్చారు. ఇంటి తాళాలు పగల గొట్టి, ఇంట్లో వస్తువులు చిందర వందరగా ఉండటం గమనించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిలో వెండి, 50 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.5 లక్షల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు పేర్కొన్నారు. పోలీసులు వెళ్లి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.85 కోట్లు లభించింది. శనివారం శ్రీవారిని 82,149 మంది దర్శించుకోగా 36,578 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో చర్చిస్తున్న బీఆర్ నాయుడు

తిరుమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన ఆదివారం సాయంత్రం ఆలయ మాడవీధుల్లో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడు కనులార వాహనసేవలను వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. విద్యుత్ అలంకరణపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. తిరుమలలో 35 ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీవీఎస్వో మురళికృష్ణ, సీఈ సత్యనారాయణ, ఈఈ సుబ్రహ్మణ్యం, డిప్యూటీఈవోలు లోకనాథం, రాజేంద్రకుమార్, సోమన్నారాయణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం మంగళవారం జరుగనుంది. అన్నమయ్య భవనంలో చైర్మన్ బీఆర్ నాయుడు నేతృత్వంలో సభ్యులు సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు మొదలయ్యే సమావేశంలో ప్రధానంగా ఈనెల 24 నుంచి అక్టోబరు 2 వరకు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలపై చర్చించనున్నారు. పలు రకాల కొనుగోళ్లు, అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపులపై తీర్మానాలు చేయనున్నారు.

జీజేఎల్ఏ రాష్ట్ర నూతన కార్యవర్గం



అధ్యక్షుడు రవి, ఇతర కార్యవర్గ సభ్యులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): ఎల్‌బీసీ రోడ్డులోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా బి.వెంకట శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా పీఎంకేఎం నాయుడు, ఫైనాన్స్ కార్యదర్శిగా వి.రవీంద్రారెడ్డి, మహిళా కార్యదర్శిగా ఎల్.మహేశ్వరి, జోన్-2 అధ్యక్ష, కార్యదర్శులుగా కిరణ్‌కుమార్, రాంబాబు, జోన్-3 అధ్యక్ష, కార్యదర్శులుగా కేవీ సుబ్బారెడ్డి, కేవీసాంబశివరావు, జోన్-4 అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.విజయచంద్ర లోహిత్, ఎస్.శ్యామ్‌సుందర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

నేడు ముందస్తు క్యాన్సర్ పరీక్షలు

పాకాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దామలచెరువు సచివాలయంలో పింక్ బస్సు క్యాంపులను నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ అరవింద్ కుమార్, డాక్టర్ రవిరామ్‌లు తెలిపారు. ఉదయం 10 గంటలకు క్యాంపు ప్రారంభమవుతుందన్నారు.

తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్సులో అపుస్మా

● 500మంది టీచర్లకు పురస్కార ప్రదానం



ఎంపీ, ఎమ్మెల్యేలతో కలసి పురస్కార గ్రహీతలు

తిరుపతి రూరల్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): ఏపీప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా)కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు లభించింది. చిగురువాడలోని ఇంటర్నేషనల్ డిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం రాయలసీమజోన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 500మందికి పురస్కారం, మెమెంటోలను అందజేశారు. రాయలసీమ 8జిల్లాలతో పాటు సంఖ్యాపరంగా 500మంది టీచర్లకు ఒకేసారి అవార్డులను అందించి రికార్డు నమోదు చేశామని తెలుగు బుక్ రికార్డ్సు ప్రతినిధులు డాక్టర్ సి.నారాయణస్వామి, శరత్‌చంద్రలు పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నానీ, కలికిరి మురళీమోహన్, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిల నుంచి అపుస్మా రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు ఈపురస్కారాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో ఆవిష్కరణలు రూపొందించేలా తీర్చిదిద్దాలని సూచించారు. ఏపీ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ ఎం.సుగుణమ్మ, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, డీఈవో కేవీఎన్ కుమార్, అప్పుస్మా రాష్ట్ర అధ్యక్షుడు కె.తులసీవిష్ణుప్రసాద్, రాయలసీమజోన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి, నాయకులు డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, పీవీ రమణారెడ్డి, కేఎస్ వాసు, బి.రవీంద్రారెడ్డి, సింగరాజు భాస్కర్‌రాజు, రెడ్డి శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వధూవరులతో గవర్నర్ దంపతులు

ఘనంగా వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ మనవరాలి వివాహం

తిరుపతి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వీఐటీ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డా. జి. విశ్వనాథన్ మనవరాలు కాదంబరి ఎస్.విశ్వనాథన్ వివాహం ఆదివారం తిరుపతిలో వైభవంగా జరిగింది.ఏపీ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులతో పాటు వివిధ రంగాల ప్రముఖులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు ఈ వివాహానికి హాజరయ్యారు. నూతన వధూవరులు కాదంబరి ఎస్.విశ్వనాథన్, డాక్టర్ ఎ.శ్రవణ్ కృష్ణకు గవర్నర్ దంపతులు ఆశీస్సులందజేశారు. ఈ వేడుకలో వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాధన్, శేఖర్ విశ్వనాథన్, జీవీ సెల్వంతోపాటు రమణి బాలసుందరం, సంధ్యా పెంటారెడ్డి, అనుషా సెల్వం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్లాటుదారులకు న్యాయం చేయాలి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : శెట్టిపల్లిలో పెండింగ్‌లో ఉంచిన ప్లాటుదారులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. తిరుపతి యశోదనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ప్లాటుదారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ ప్రకటించిన అర్హుల జాబితాలో పేర్లున్నా మూడువందల మంది ప్లాటుదారులను పెండింగ్‌లో పెట్టారని తెలిపారు. కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నా పలు కారణాలు చూపి పెండింగ్‌లో పెట్టడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి వీరికి న్యాయం చేయాలని కోరారు.

రేపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 నుంచి 10 గంటల వరకు శ్రీవారి మూలమూర్తిని తెల్లని వస్త్రంతో కప్పి ఉంచుతారు. అన్ని దేవతామూర్తులను, ఇతర వస్తువులను గర్భగుడి నుంచి బయటకు తెచ్చి కర్పూరం, గంధం, కుంకుమ, పసుపు, కిచ్చిలిగడ్డ మొదలైన వాటితో కూడిన పరిమళం అనే సుగంధ మిశ్రమంతో శుభ్రం చేస్తారు. తర్వాత మూలమూర్తిపై ఉన్న వస్త్రాన్ని తొలగించి లోపల ఇతర పరివార దేవతలు, దీపం, పూజవస్తువులను మళ్లీ లోపలికి తీసుకొస్తారు. అనంతరం ఆగమోక్తంగా స్వామికి ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పిస్తారు. ఆలయశుద్ధి నేపథ్యంలో మంగళవారం వీఐపీ బ్రేక్ దర్శనాలను, అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. సోమవారం ఎలాంటి సిఫార్సు లేఖలు తీసుకోమని స్పష్టం చేసింది. ఏడాదిలో నాలుగుసార్లు ఈ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశి, బ్రహ్మోత్సవాల ముందు వచ్చే మంగళవారం ఈ వేడుకను నిర్వహించడం ఆనవాయితీ.

ముగిసిన నృత్య కళోత్సవం



భరత్‌శర్మకు అవధాన కౌముది పురస్కార ప్రదానం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : మహతి ఆడిటోరియంలో మూడు రోజులపాటు జరిగిన రాయలసీమ రంగస్థలి నృత్య కళోత్సవం ఆదివారం ముగిసింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ముగింపు వేడుకల్లో శతావధాని ప్రచనకర్త ఉప్పలధడియం భరత్‌శర్మను అవధాన కౌముది పురస్కారంతో సత్కరించారు. వరంగల్‌కు చెందిన రేణుకకు నాట్యవిద్వన్మణి బిరుదును ప్రధానం చేశారు. నృత్య ప్రదర్శనలతో ప్రతిభచూపిన కళాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ రిటైర్డ్ డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు పోకల ఆశోక్‌కుమార్, పారిశ్రామికవేత్త పీసీ రాయులు, తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు ఎం.వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్ బాబు, ఆకుల సతీష్‌కుమార్, జనసేన నేత కృష్ణయ్య పాల్గొని ప్రాచీన కళలను ప్రోత్సహిస్తున్న రంగస్థలిని అభినందించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథరెడ్డి, కార్యదర్శి కెఎస్.రాజా పాల్గొన్నారు

నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు

● ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఎన్నికలను నిబంధనలకు విరుద్ధంగా, ఏకపక్షంగా నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాల కార్యవర్గ ఎన్నికల అనంతరం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. పూర్తిస్థాయిలో జిల్లా ఎన్నికలు జరగకనే రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ తాము పోటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. తమ కార్యవర్గాన్ని గుర్తించాలని కోరుతూ ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ పంపినట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక నిర్వహించాలని, లేకపోతే పోటీ కార్యవర్గం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అసోసియేషన్ సభ్యులు హరీష్, రామాంజనేయులు, రవీంద్రబాబు పాల్గొన్నారు.

నృత్యం ముగ్ధమనోహరం



తిరుచానూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో ఆదివారం జరిగిన నృత్య ప్రదర్శన ముగ్ధమనోహరంగా సాగింది. వారంతపు సెలవులను పురస్కరించుకుని చెన్నైకు చెందిన శంకర నాట్య విద్యాలయానికి చెందిన కళాకారులు సాయి దర్శిని, కిరుతికా, యజ్ఞిని, పల్లవి, యాసికా, హాన్షికా, శివాని, కావ్య తదితరులు రామానుజర్,గోవిందన్ కుజల్, ఆదదు ఆసంగ్గదు, దేవినీ, దుర్గే కవిత్తువం, జతీశ్వరం తదితర గీతాలకు నృత్యప్రదర్శన చేశారు. వారిని ఏవో సుధాకర్ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

పిట్టు స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సురేష్

చంద్రగిరి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ పగడాల సురేష్ పిట్టు స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఏకగ్రీవకంగా ఎన్నికయ్యారు. పుట్టపర్తిలో జరిగిన అసోసియేషన్ ఆదివారం సమావేశం జరిగింది. క్రీడారంగంలో సేవలందిస్తున్న సురేష్ అధ్యక్షుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఈయన ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెటర్ అసోసియేషన్ చైర్మన్‌గా పనిచేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎస్పీ



ఆలయం ముందు సుబ్బరాయుడు

తిరుమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి):జిల్లా ఎస్పీగా నియమితులైన సుబ్బరాయుడు కుటుంబ సమేతంగా ఆదివారం ఉదయం సుప్రభాతసేవలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈసందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీకి చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు.

యువతి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కొరమేనుగుంట ఎస్టీ కాలనీకి చెందిన యువతి ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి వివరాల మేరకు.. కొరమేనుగుంట ఎస్టీ కాలనీకి చెందిన వెంకటేష్ కూలి పనులు చేసి, కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమార్తె రవిత్రిని(19) తొమ్మిదో తరగతి వరకు చదివి ఇంటి వద్ద ఉంటోంది. జులాయిగా తిరుగుతుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. మనస్థాపం చెందిన రవిత్రిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

జాతీయ సదస్సుకు పటిష్ఠ బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం ప్రారంభమైన జాతీయ మహిళా సాధికారిత సదస్సు నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌ను మళ్లించారు. మామిడికాయల మండీ వైపు వెళ్ళే రోడ్డు, తిరుచానూరు ఫ్లై ఓవర్ సర్కిల్ వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. వీఐపీలు వస్తున్నారంటూ వాహనాల రాకపోకలను అనుమతించలేదు. ఈ క్రమంలో పలువురు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పద్మావతి అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులూ అవస్థ పడ్డారు. పుత్తూరు వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు.

ఆటో బోల్తా: డ్రైవర్ మృతి

చిట్టమూరు, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోగిలి చెరువు కట్ట సమీపంలో ఆదివారం ఆటో బోల్తా పడి కమతం మణి(35) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... కోగిలికి చెందిన మణి ఆటో నడుపుతాడు. ఆదివారం కొత్తగుంటకు వెళ్తుండగా ఆటో బోల్తా పడింది. మణి తీవ్రంగా గాయపడగా, అదే ఆటోలోమరో ఆరుగురు గాయపడ్డారు. మణిని వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేయించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ బందోబస్తు

● తిరుమల కమాండ్ కంట్రోల్ ద్వారా నిఘా ● అధికారులకు ఎస్పీ ఆదేశాలు



అధికారులతో సమావేశమైన ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పక్కా ప్రణాళికలతో పటిష్ఠ బందోబస్తు నిర్వహించాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. తిరుపతి ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన జిల్లా కమాండ్ కంట్రోలు యూనిట్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాలపై అధికారులతో సమీక్షించారు. సెక్యూరిటీ పాయింట్‌లో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అలిపిరి వద్ద, తిరుమలలో ద్విచక్ర వాహనాలకు, నాలుగు చక్రాల వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలన్నారు. తిరుమల కమాండ్ కంట్రోలు యూనిట్ ద్వారా పటిష్ఠమైన నిఘా.. రియల్ టైం మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజు సీఎం చంద్రబాబు నాయుడు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించడానికి వస్తున్న తరుణంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రౌడ్.. ట్రాఫిక్ మేనేజ్‌మెంటుపై పలు సూచనలు చేశారు. తిరుమల, తిరుపతిలో దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, బ్యాగ్ లిఫ్టింగ్‌లు, ఇతర నేరాలు జరగకుండా క్రైం పార్టీలను నియమించాలని క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావును ఆదేశించారు.

ఈ విషయంలో టీటీడీ సెక్యూరిటీ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, వెంకట్రావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ వెంకటనారాయణ, తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, శ్రీలత, శ్యాంసుందర్, విజయశేఖర్, శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



రాహుల్ కన్వెన్షన్ సెంటర్ వద్ద లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్



లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను సత్కరిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే నాని



అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడితో నరసింహయాదవ్, మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ



సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేటర్ అన్నా అనిత, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి



సదస్సులో కమిషనర్ మౌర్య, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ మహిళా నేత బీపీ కీర్తి



సదస్సులో ఎమ్మెల్యే భానుప్రకాష్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, టీడీపీ చిత్తూరు ఇన్‌చార్జ్ సీఆర్.రాజన్

గంగమ్మ ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం

తిరుపతి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి) : తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం ఆదివారం నిరాడంబరంగా జరిగింది. ముందుగా అమ్మవారిని దర్శించుకున్న సభ్యులు ఆలయ ప్రాంగణంలో ప్రమాణం చేశారు. దేవదాయ శాఖ చట్టం 1987 ప్రకారం ఆలయ ఈవో జయకుమార్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ మహేష్ యాదవ్ నేతృత్వంలోని 11 మంది సభ్యులతోపాటు ఎక్స్‌అఫిషియో సభ్యుడైన ప్రధాన అర్చకుడు మురళీస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, శాప్ చైర్మన్ రవినాయుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్‌తోపాటు క్లస్టర్ ఇన్‌చార్జి పులుగోరు మురళి, జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి పాల్గొని నూతన పాలకమండలికి శుభాకాంక్షలు తెలిపారు.

కూటమిలో పాలకమండలి చిచ్చు

తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలకమండలి నియామకం కూటమిలో చిచ్చురేపింది. ప్రధానంగా టీడీపీలో విభేదాలు భగ్గుమన్నాయి. నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ వర్గంలో ఉన్న అసంతృప్తులు ఆదివారం బట్టబయలయ్యాయి. ప్రెస్‌క్లబ్‌లో ఆమె అనుచరులు రెండు గ్రూపులుగా వచ్చి మీడియాతో మాట్లాడారు. కష్టపడిన వారికి చోటు లేదని, సుగుణమ్మ పంపిన జాబితాను అధిష్ఠానం పరిగణనలోకి తీసుకోకపోవడం బాధాకరమని ఆవేదన చెందారు. దీంతో పార్టీలోని ఆమె వ్యతిరేక వర్గం సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించింది. 2019 ఎన్నికల సమయంలో సుగుణమ్మ పీఎల్ఆర్ కంపెనీ నుంచి ఆర్థిక లావాదేవీలు జరిపారని, వైసీపీ నేతలను ప్రసన్నం చేసుకుంటూ ఆస్తులు కాపాడుకున్నారని ఆరోపణలు చేశారు.



గంగమ్మ ఆలయంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకమండలి సభ్యులు

ఐక్యతతోనే అభివృద్ధి

● రాష్ట్ర బలిజ సేన సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : ఐక్యంగా ఉంటే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చునని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఉదయీ ఇంటర్నేషనల్ హోటల్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర బలిజ సేన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో తనకు అత్యధిక మెజారిటీ రావడంలో బలిజల పాత్ర కీలమని పేర్కొన్నారు. రాష్ట్ర హస్త, చేనేత కళల చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ జనసేనకు తోడుగా బలిజ సేన ఉంటుందని తెలిపారు. అనంతరం బలిజసేన లోగో కలిగిన గొడుగులను పంపిణీ చేశారు. బలిజసేన అధ్యక్షుడు కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సురేష్, ఉపాధ్యక్షులు రాయని రమేష్, మస్తాన్ రాయల్, సంయుక్త కార్యదర్శి గీతాంజలి రమణ పాల్గొన్నారు.

హాల్‌మార్క్‌పై అవగాహన

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన, నమ్మకమైన బంగారం అందించాలనే ఉద్దేశంతో హాల్‌మార్క్ యూనిక్ ఐటెంటిఫికేషన్ కోడ్‌పై స్థానికంగా ఉన్న ఒక హోటల్లో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ బులియన్ గోల్డ్ సిల్వర్ అండ్ డైమండ్స్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ భారత ప్రభుత్వం విడుదల చేసిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ మార్గదర్శకాలకు అనుగుణంగా బులియన్ మార్కెట్ నడపాలని సూచించారు. చీఫ్ ఆర్గనైజర్ ఎస్.శాంతిలాల్, జితేంద్రకుమార్, బాబు, శంకరరావు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్పీకి శ్రీవారి ప్రసాదాలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్పీగా ఆదివారం బాధ్యతలు తీసుకున్న ఎల్.సుబ్బరాయుడికి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, శాప్ చైర్మన్ రవి నాయుడు, టీడీపీ తిరుపతి పార్లమెంటు ఇన్‌చార్జి నరసింహయాదవ్, సీనియర్ నేత ఊకా విజయకుమార్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీధర్ వర్మ శ్రీవారి ప్రసాదాలు అందచేశారు. ఆయనకు అభినందనలు తెలిపారు.

సీపీఎస్ ఉద్యోగుల సమస్యలపై వినతి

తిరుపతి అర్బన్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగుల సమస్యలపై ఏపీ గవర్నమెంట్ పాలిటెక్నిక్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్‌బాషా ఆదివారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు, ఇతర ప్రయోజనాలను వెంటనే విడుదల చేసేలా చూడాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

22నుంచి కపిలేశ్వరాలయంలో నవరాత్రి ఉత్సవాలు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరాలయంలో కామాక్షి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 18న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 22వ తేదీన అంకురార్పణ ఉంటుందని వివరించారు. ఆఖరి రోజు అభయహస్త ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో పార్వేట ఉత్సవం నిర్వహిస్తామని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

లోక్‌సభ స్పీకర్‌కు సన్మానం



ఓంబిర్లాను సన్మానిస్తున్న పీసీ రాయలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా సాధికార సదస్సుకు హాజరయ్యేందుకు వచ్చిన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను హోటల్ తాజ్ వద్ద కస్తూర్బా కేంద్రట్రస్టు చైర్మన్, విమానాశ్రయ అథారిటీ ఆఫ్ ఇండియా సభ్యుడు పీసీ రాయులు మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. స్పీకర్ ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఆదివారం సాయంత్రం జరిగిన 9వ రాష్ట్ర తైక్వాండో పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరించారు. వయస్సు, బరువు, ఎత్తు ప్రాతిపదికన 35మంది బాలబాలికలు పాల్గొని సబ్ జూనియర్, జూనియర్, క్యాడెట్, సీనియర్ కేటగిరీలలో సత్తాచాటారు. 10స్వర్ణ, 3రజిత, ఒక కాంస్య పతకం సాధించారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, గ్రాండ్‌మాస్టర్ కె.వి.బాబురావు, ఆనందరావు వారిని అభినందించారు.

నాన్ టీచింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అనంతపురం ఎస్కే యూనివర్సిటీలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్వీయూ నాన్ టీచింగ్ ఉద్యోగి నెల్లూరు సుబ్రమణ్యంను ఎన్నుకున్నారు. రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్‌గా ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ మెకానిక్‌గా పనిచేస్తున్న మనోజ్ కుమార్ సింగ్‌ను ఎన్నుకున్నారు.

నేడు మారిషస్ ప్రధాని రాక

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రాంగులామ్ సోమవారం జిల్లాకు రానున్నారు. మధ్యాహ్నం 12.40 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా రామచంద్రాపురం మండలం సి.రామాపురంలోని బ్రహర్షి ఆశ్రమాన్ని సందర్శిస్తారు. అక్కడి నుంచి తిరుమలకు వెళతారు. 4.15 గంటలకు తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. సాయంత్రం 5 గంటలకు విమనాశ్రయానికి చేరుకుంటారు. 6 గంటలకు ఢిల్లీ బయలుదేరి వెళతారు.

మహిళాభ్యున్నతికి సాధికారత సోపానం

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం జాతీయ మహిళ సాధికారత సదస్సు ప్రారంభమైంది. రెండురోజుల పాటు జరిగే ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల చట్టసభల జాతీయ మహిళ సాధికారత సభ్యులు హాజరయ్యారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షత వహిస్తున్నారు. ఈ సందర్భంగా మహిళ సాధికారతపై సభ్యులు ఏమన్నారంటే...

మహిళా సాధికారతతోనే అభివృద్ధి



మహిళలు సర్వతోముఖాభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది. నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబునాయుడు మహిళా పక్షపాతులు. మహిళలకు ఆస్తిలో సగంవాటా, తిరుపతిలో పద్మావతి మహిళా యూనివర్శిటీ ఏర్పాటు లాంటి కార్యక్రమాలకు ఆనాడు దివంగత ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. ఆయన పంథాలోనే చంద్రబాబునాయుడు పదవుల్లో, ఉద్యోగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నారు. ఇలాంటి సదస్సులు వల్ల మహిళలు ఎదగడానికి అవకాశం ఉంటుంది.

- వంగలపూడి అనిత, రాష్ట్ర హోంమంత్రి

వంట గది నుంచి అంతరిక్షయానానికి



మహిళలు పూర్వపు రోజుల్లో వంట గదికే పరిమితమయ్యేవారు. నేడు అంతరిక్షానికి ప్రయాణించే స్థాయికి చేరుకున్నారు. అద్భుతమైన మైళ్లురాళ్లను అధిగమిస్తున్నారు. మహిళలు మరింత ముందంజ వేయడానికి సాధికార సదస్సు ఉపయోగపడుతుంది. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో మహిళల సాధికారత, సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది. 33శాతం రిజర్వేషన్లను తీసుకురానుంది.

-డీకే అరుణ, మహబూబ్‌నగర్ ఎంపీ,

ఫలప్రద చర్చలకు ఆస్కారం



మహిళలు అనేక రంగాల్లో రాణిస్తున్నారు. గ్రామీణ మహిళలు సైతం చట్టసభల్లో అడుగు పెడుతున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా దూరదృష్టితో మహిళల అభివృద్ధి కోసం తొలిసారిగా మహిళా సాధికార సదస్సు తిరుపతిలో నిర్వహించడం గర్వించదగ్గ విషయం.. సదస్సులో ఫలవంతమైన చర్చలు జరుగుతున్నాయి.

- సుధామూర్తి, రాజ్యసభ సభ్యురాలు, కర్ణాటక

మరింత సాధికారత అవసరం



స్త్రీ ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వావలంబన సాధించిన దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. దేశ జనాభాలో సగం ఉన్న మహిళలు మరిన్ని రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకోవాలి. మహిళ ఆర్థిక స్వావలంబన సాధించినపుడే కుటుంబం మెరుగైన స్థితికి చేరుకుంటుంది. ఇలాంటి సదస్సులు మహిళలకు ప్రయోజనకరం

- వరలక్ష్మి, చెంగల్పట్ ఎమ్మెల్యే, తమిళనాడు

విద్యతో వివక్షకు సమాధానం



ఏపీ ప్రభుత్వం జాతీయ మహిళా సాధికారత సదస్సుకు చేసిన ఏర్పాట్లు బాగున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి అభినందనీయం. బాల్య దశ నుంచే మహిళలపై వివక్షత కొనసాగకుండా ఉండాలంటే బాలికలకు మెరుగైన విద్య, వైద్యం అందించాలి. అన్ని రాష్ట్రాల్లో మహిళ హక్కులు కాపాడాలి. ఆర్థికంగా ఎదగడానికి చేయూతనందించాలి.

- కరెమ్మ నాయక్, దేవదుర్గ ఎమ్మెల్యే, కర్ణాటక

33శాతం రిజర్వేషన్ కల్పిస్తే సత్తా చాటుతాం



రాష్ట్రంలో మహిళాభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి అమోఘం. ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలయితే సర్పంచ్ నుంచి పార్లమెంటు వరకు సత్తా చాటుతారు. పనిచేసే చోట ఇప్పటికీ మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటివి జరగకుండా రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురావాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తున్న ఈ జాతీయ సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉంది

- పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే

చంద్రబాబు స్ఫూర్తితో రాజకీయాల్లోకి...



మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధిపై చర్చకు తొలిసారి సాధికార సదస్సు తిరుపతిలో నిర్వహించడం సంతోషంగా ఉంది. మా అమ్మ శోభా నాగిరెడ్డి చంద్రబాబు స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని రాజకీయాల్లో వచ్చాను. మహిళలకు చట్టసభల్లో అవకాశం వస్తే సమాజం అభివృద్ధి చెందుతుందనేది చంద్రబాబు విశ్వాసం.

- భూమా అఖిలప్రియ, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రతి రాష్ట్రంలో ఇలాంటి జాతీయ సదస్సు నిర్వహించాలి. అన్ని రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం వహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా అంగన్‌వాడీలను పరిపుష్టి చేసి బాలికలకు మెరుగైన విద్యను అందించాలి. బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉంది.

- ఎన్‌హెచ్ కోనరెడ్డి, కర్ణాటక మహిళ సాధికార కమిటీ చైర్మన్

సదస్సు నిర్ణయాలతో సాధికారతకు బాట



మహిళా సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యం కృషి చేస్తున్నాయి. నాడు ఎన్టీఆర్ బాటలోనే నేడు సీఎం చంద్రబాబు మహిళాలోకం గర్వించదగ్గ స్థాయిలో పనిచేస్తున్నారు. ఐటీ రంగంలో కూడా మహిళలే ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారు. ఇందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ సదస్సు చర్చించి తీసుకునే నిర్ణయాలతో మహిళా సాధికారత అమలుకు అవకాశం కలుగుతుంది.

- పయ్యావుల కేశవ్, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి

ఉచిత వైద్యశిబిరం

చిల్లకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీగపాళెం గ్రామంలో గల బీవీఎస్‌ఆర్ కన్స్‌ట్రక్షన్స్ కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన శిరిడిసాయి రూరల్ వెల్ఫేర్, మెడికల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు

కోట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు గ్రీవెన్స్ డే రద్దు

గూడూరు అర్బన్, డక్కిలి, పెళ్లకూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు గూడూరు, డక్కిలి మండలాల తహసీల్దార్లు ప్రసాద్, శ్రీనివాసులు, పెళ్లకూరు డిప్యూటీ తహసీల్దారు తెలిపారు. తిరుపతిలో జరుగుతున్న మహిళా సాధికారత జాతీయ సదస్సు నిర్వహణ విధుల్లో అధికారులు ఉన్న కారణంగా గ్రీవెన్స్ డేను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

16, 17 తేదీల్లో స్కూల్ గేమ్స్

చిట్టమూరు, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): అరవపాళెం ఉన్నత పాఠశాలలో ఈ నెల 16, 17 తేదీల్లో స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు ఎంఈవో కృష్ణయ్య తెలిపారు. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చెస్ క్రీడల్లో అండర్ 14, అండర్ 17 బాల బాలికలకు పోటీలు జరుగుతాయన్నారు. ప్రతిభ చూపిన వారిని డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.





జాతీయ రహదారి ఇరువైపులా పార్కింగ్ చేసివున్న వాహనాలు - ఆర్టీవో కార్యాలయ దారిలోనూ ఆపిన వాహనాలు

జాతీయ రహదారిపై వాహనాల పార్కింగ్

ట్రాఫిక్ సమస్యతో పాటు రాత్రిపూట ప్రమాదాలు ● పట్టించుకోని హైవే పెట్రోలింగ్ పోలీసులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో జాతీయ రహదారిపై వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, లారీలు, ఇతర వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా సూళ్లూరుపేట నుంచి శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడలకు వెళ్లే ట్రావెల్స్ బస్సులు, మినీ వ్యాన్‌లను హోలీక్రాస్ కూడలి నుంచి కోటపోలూరు క్రాస్ రోడ్డు వరకు హైవేకి ఇరువైపులా ఎక్కడ పడితే అక్కడ నిలుపుతున్నారు. దీనికి తోడు హోటళ్లు, దాబాల వద్ద ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో వాహనాలు బారులు తీరుతున్నాయి. దీంతో రహదారిపై ఇతర వాహనాలు వెళ్లడానికి ఇబ్బందికరంగా మారుతోంది. దీనివల్ల రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా సూళ్లూరుపేట పట్టణంలో ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఫ్లైఓవర్‌ను అనుకుని రెండు వైపులా వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు వెళ్లే జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వరకు జాతీయ రహదారికి ఇరువైపులా పట్టణంలో ఉండే ట్రావెల్స్ బస్సులు, ఇతర వాహనాలతో పాటు లారీలు బారులు తీరుతున్నాయి. శని, ఆదివారం రెండు రోజులైతే పరిశ్రమలకు సెలవు కావడంతో కంపెనీలకు వెళ్లే వాహనాలన్నీ జాతీయ రహదారి పక్కనే పార్కింగ్ చేస్తున్నారు. ఈ మార్గంలోనూ హైవేను అనుకొని ఉన్న హోటళ్లు, దాబాలకు అల్పాహారం కోసం వెళ్లే వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు ఆపుతున్నారు. దాబాలు, ట్రావెల్స్ యజమానులు ప్రైవేట్ పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసుకోవాలి. కాని ఎక్కడా ఈ నిబంధనలు అమలు చేయడం లేదు. రాత్రిపూట గస్తీలో తిరుగుతున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు చూసిచూడనట్లు ఉంటున్నారు. హైవేపై వాహనాలు పార్కింగ్ చేయనీకుండా హైవే పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

గూడూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్ సమీపంలోని శ్మశానం వద్ద ఈనెల 9వ తేదీన జరిగిన రహీద్‌బాషా హత్యకేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో నివాసముంటున్న రహీద్‌బాషా అలియాస్ మున్నా, అదే ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు అలియాస్ వెంకీ, ఇందిరమ్మ కాలనీకి చెందిన షఫీర్ అలియాస్ అజ్జు స్నేహితులు. ఈనెల 9వ తేదీ రాత్రి ముగ్గురూ కలిసి ఇందిరమ్మ కాలనీలో ఉన్న ఓ మద్యం దుకాణం వద్ద మందు తాగారు. అక్కడ నుంచి ఒకే మోటారు బైక్‌పై ముగ్గురూ కలిసి ఒకటో పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో మద్యం కొనుగోలు చేసి టిడ్కో గృహాలకు బయలుదేరారు. ఎస్‌కేఆర్ కళాశాల దాటిన అనంతరం రహీద్‌బాషా, షఫీర్ మధ్య మాటామాటా పెరిగి స్వల్ప వివాదం చోటు చేసుకుంది. గతంలో తాను సహజీవనం చేస్తున్న ఓ మహిళ గురించి రహీద్‌బాషా అసభ్యకరంగా మాట్లాడి ఉండడంతో వెంకటేశ్వర్లు కూడా కోపం పెంచుకున్నాడు. గాంధీనగర్ క్రిస్టియన్ సమాధుల వద్ద మోటారు బైక్ ఆపి రహీద్‌బాషాపై షఫీర్, వెంకటేశ్వర్లు దాడికి పాల్పడ్డారు. వెంకటేశ్వర్లు చాకుతో రహీద్‌బాషాను పొడిచి హతమార్చాడు. సమీపంలోని సబ్‌స్టేషన్‌కు వెళ్లే రోడ్డు వద్ద బైక్ యాక్సిడెంట్‌గా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. హత్యానంతరం వెంకటేశ్వర్లు, షఫీర్ టిడ్కో గృహాల్లో నివాసముంటున్న ఓ మహిళ ఇంటికి వెళ్లగా ఆమె వారికి ఆశ్రయం కల్పించింది. 10వ తేదీ ఉదయం ముగ్గురు నిందితులు కలిసి చిల్లకూరు మండలం కనుపూరు గ్రామానికి వెళ్లి అక్కడ తల దాచుకున్నారు. 10వ తేదీ ఉదయం గాంధీనగర్ సమీపంలోని శ్మశానం వద్ద రక్తపు మడుగులో పడివున్న రహీద్‌బాషా మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం వరగలి క్రాస్‌రోడ్డు వద్ద వెంకటేశ్వర్లు, షఫీర్‌లను, హత్యానంతరం నిందితులకు ఆశ్రయం కల్పించిన మహిళను అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రామేశ్వరరావు, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల మారథాన్



పరుగు పందెంలో చిన్నారులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నాయుడుపేట స్పోర్ట్స్ ఫౌండేషన్(ఎన్‌ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో మారథాన్ నిర్వహించారు. ఆదివారం ఉదయం సంస్థ నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలన చేసి మారథాన్ ప్రారంభించారు. చిన్నారుల్లో ఆరోగ్య సంరక్షణ, క్రీడా స్ఫూర్తిని పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు ప్రసంశాపత్రాలు, బహుమతులు అందజేశారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

పెళ్లకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ ధనుంజయులు తెలిపారు. ఈ నెల 15నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి మూడు నెలలు పైబడిన పశువులకు టీకాలు వేస్తామన్నారు.

గూడలిలో ఉచిత వైద్య శిబిరం

కోట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. కోటకు చెందిన జనతా క్లినిక్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నాయకులు ఆములూరు నాగార్జున, కె.బుల్లయ్య, రాజనాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ఉమేరా, విక్రమ్‌రెడ్డి స్త్రీ సంబంధిత వ్యాధులు, రక్తహీనత, కీళ్లనొప్పులు, నడుము నొప్పులు, బీపీ, షుగర్, గ్యాస్ ట్రబుల్, ఎముకలు, నరాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

పోలేరమ్మ ఆలయ చైర్మన్‌కు సత్కారం

వెంకటగిరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆలయ చైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణను ఆదివారం తిరుపతి జనసేన నాయకులు చెకూరు నీలాద్రి, టీడీపీ నాయకులు బెల్లంకొండ రమేష్ సన్మానించి శ్రీవారి జ్ఞాపికను అందజేశారు.

పక్షోత్సవాలను విజయవంతం చేయండి



సమావేశంలో బీజేపీ నాయకులు

తడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 17నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరిగే సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు తేజారెడ్డి అన్నారు. ఆదివారం అక్కంపేట బీజేపీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి రాచర్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: డ్రైవర్ మృతి

చిట్టమూరు, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోగిలి చెరువు కట్ట సమీపంలో ఆదివారం ఉదయం ఆటో బోల్తా పడి కమతం మణి(35) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... కోగిలి గ్రామానికి చెందిన మణి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. ఆదివారం కొత్తగుంటకు వెళ్తుండగా ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మణి తీవ్రంగా గాయపడగా, అదే ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఆరుగురు గాయపడ్డారు. మణిని వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. క్షతగాత్రులకు కొత్తగుంటలో ప్రథమ చికిత్స చేయించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

డీఏల విడుదలకు కృషి చేయండి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఏర్పాటు చేయడంతో పాటు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయించేందుకు కృషి చేయాలని ఏటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నేతలు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని, అలాగే నూతన పీఆర్సీ ఏర్పాటు చేసి ఐఆర్‌ను ప్రకటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే హెల్త్‌కార్డుల పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచి, సీపీఎస్‌ను రద్దు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు గోపినాథ్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఉస్మాన్ బాషా, స్థానిక యూనియన్ నాయకులు వెంకరత్నం, సుధాకర్ రెడ్డి, రమణయ్య, గిరి, సుజన్, సురేష్ తదితరులు ఉన్నారు.

బీజేపీ పటిష్టతకు కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ పట్టణాధ్యక్షుడు దయాకర్

గూడూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పటిష్టతకు కలసికట్టుగా కృషి చేద్దామని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు దయాకర్ అన్నారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈనెల 17వ తేదీన ప్రధాని జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

ఇసుక అక్రమ రవాణా

● మూడు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

రేణిగుంట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లతో పాటు ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు గాజులమండ్యం పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి జీపాళెం పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖి నది తీర ప్రాంతంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో దాడులు చేశామన్నారు. వాహనాలను స్వాధీనం చేసుకుని ముగ్గురు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సుధాకర్ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.





తిరుపతిలో జరుగుతున్న జాతీయ మహిళా సాధికారత సదస్సులో శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుతో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి - మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, సవిత, వంగలపూడి అనిత, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుతో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ

పుత్తూరు వార్తలు

అభయ హస్తాధీశుడి సేవలో డిప్యూటీ స్పీకర్ రఘురామ



వడమాలపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న అభయ హస్తాధీశుడి రూపంలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి సేవలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు పాల్గొన్నారు. రఘురామకు అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. ప్రసన్న వేంకటేశ్వరుడకి అర్చన చేయించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు ఆలయ చరిత్రను వివరించారు. తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం ఇచ్చారు. ఆలయ అధికారి వేణుగోపాల్ దర్శన ఏర్పాట్లు చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చేయూత

● ఆరుగురికి రూ.8.13 లక్షల అందజేత



బాధితులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలో అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించిన పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చేయూత ఇస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసం వద్ద ఆరుగురు బాధితులకు రూ.8.13 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. పుత్తూరు మండలం తడుకు గ్రామానికి చెందిన బాలయ్యకు రూ.96 వేలు, తొర్రూరుకు చెందిన పూజితకు రూ.1.59 లక్షలు, పరమేశ్వర మంగళానికి చెందిన జానకి రామానాయుడికి రూ.1.50 లక్షలు, గొల్లపల్లికి చెందిన మునెమ్మకు రూ.29 వేలు, రాచపాలెంకు చెందిన దొరైరాజుకు రూ.1.28 లక్షలు, విజయపురం మండలం జీఎంపురానికి చెందిన రేవతికి రూ.2.50 లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు అరవ బాలాజి తదితరులు పాల్గొన్నారు.


పుత్తూరు ఫైర్ ఆఫీసర్ బదిలీ

● ఎల్‌ఎఫ్‌వో గిరిధర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ఫైర్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ తిరుపతి కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా కుప్పం నుంచి ఇటీవల పుత్తూరుకు బదిలీ అయ్యారు. ఇంతలో ఏమైందో ఏమో పట్టుమని రెండు నెలలు కూడా పూర్తి కాకముందే బదిలీ అయ్యారు. ప్రవీణ్‌కుమార్ బదిలీకి రాజకీయ ఒత్తిళ్లు కారణమని జోరుగా ప్రచారం సాగుతోంది. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్‌గా ఎల్‌ఎఫ్‌వో గిరిధర్‌కు బాధ్యతలను అప్పగించారు. గతంలో ఇక్కడ పనిచేసిన నేతాజీ ఐదు సంవత్సరాల పాటు పుత్తూరు ఫైర్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. ఇక్కడ నుంచి కుప్పంకు బదిలీపై వెళ్లారు.

లింగ సమానత్వానికి ప్రతీక శ్రీసిటీ

రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ నారాయణ సింగ్



సత్యవేడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారతదేశ లింగ సమాన అభివృద్ధిని శ్రీసిటీ ప్రతిబింబిస్తోందని రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ నారాయణ సింగ్ అన్నారు. తిరుపతిలో ఆదివారం ప్రారంభమైన జాతీయ మహిళా సాధికారతపై పార్లమెంటరీ, శాసన సభ కమిటీల జాతీయ సదస్సు ప్రారంభ సమావేశానికి హరివంశ్ నారాయణ సింగ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసిటీలోని మొత్తం ఉద్యోగుల్లో సగానికి పైగా మహిళలు పని చేస్తూ సంస్థ అభివృద్ధిలో విశిష్టమైన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఇది లింగ సమాన అభివృద్ధికి నిదర్శనమన్నారు. దేశ విస్తృత అభివృద్ధికి అనుసంధానంగా ఉందని ఆయన శ్రీసిటీ గురించి తన అభిప్రాయం వ్యక్తం చేయడం విశేషం.

కొయ్య బొమ్మలను బహిరంగ మార్కెట్‌లో విక్రయించడానికి అనుమతివ్వండి



అనుమతులు ఇవ్వాలని కోరుతున్న కృష్ణమూర్తి

ఏర్పేడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కళాకారులు తయారు చేసిన కొయ్య బొమ్మలను బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకోవడానికి అనుమతి ఇవ్వాలని మాధవమాల బాలాజీ ఉడ్ కార్వింగ్ సొసైటీ కళాకారులు ఏపీ ఫారెస్టు డెవలప్‌మెంట్ యాక్టివిటీస్ సలహాదారు మల్లికార్జునరావును కోరారు. మాధవమాలలో ఉన్న బాలాజీ ఉడ్ కార్వింగ్ సొసైటీని ఆయన ఆదివారం సందర్శించిన సందర్భంగా కొయ్య బొమ్మ తయారీ కళాకారులతో భేటీ అయ్యారు. అలాగే ప్రభుత్వం నుంచి రాయితీపై రుణాలను ఇప్పించాలని కోరారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోటరీ క్లబ్‌లో ఆదివారం నిర్వ హించిన చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. శ్రీరామ్ నగర్‌కాలనీలోని సాయి బాబా సత్సంగ కేంద్రం 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్‌లో చిన్నారలు నృత్య ప్రదర్శన నిర్వహించారు. పలువురు చిన్నారులు సాయిబాబా గీతాలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. దర్శిని, జ్ఞాపిక, చందన, లోహిత్, రాజీవిని, జయవాణి బృందం చేసిన నాట్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



మసీదు వద్ద ప్రతిజ్ఞ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరి కృషి అవసరమని ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ రాజారెడ్డి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా బాల్య వివాహాలను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ సంస్థ చేపట్టిన కార్యక్ర మంలో భాగంగా పట్టణంలోని పూసలవీధిలో ఉన్న మసీదులో అధ్యక్షుడు షన్వాస్ ఆధ్వర్యంలో ముస్లింలతో, చర్చిలో పాస్టరు ఆంబ్రోస్, వివిధ సంఘాల నాయకులతో కలిసి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ... ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో బాల్య వివాహాల నిర్మూలనపై మతపెద్దలు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇమామ్, లాలుబాషా, షబ్బీర్, ఉస్మాన్, మౌలాలి, అబ్దుల్లా, పాస్టర్లు డేనియల్, లూకా, కమ్యూనిటీ సోషల్ వర్కర్స్ చందమామల కోటయ్య, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో ప్రముఖులు



పరశురామేశ్వరుని ఆలయం వద్ద మధ్యప్రదేశ్ ఎమ్మెల్యే ఉమా సోలంకి

ఏర్పేడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో మొదటి శివాలయంగా గుర్తింపు పొందిన గుడిమల్లం పరశురా మేశ్వరుడిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అందులో కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, మధ్యప్రదేశ్ ఎమ్మెల్యే ఉమా సోలంకి, ఢిల్లీ శాసనసభ డిప్యూటీ సెక్రటరీ రాకేష్‌శర్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన కొందరు ప్రముఖులు, తిరుపతి డిప్యూటీ కలెక్టర్ సందీప్ రఘువంశన్‌తో కలిసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో రామచంద్రారెడ్డి, ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అగ్నిగుండ ప్రవేశం



పిచ్చాటూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం సాయంత్రం ద్రౌపది సమేత ధర్మరాజస్వామి తిరుణాళ్లలో భాగంగా చివరి రోజు భక్తులు భక్తిశ్రద్ధలతో గుండ ప్రవేశం చేశారు. కాపు కట్టుకున్న భక్తులు పసుపు వస్త్రాలు ధరించి 9 బావుల్లో అభ్యంగన స్నానాలు చేసి నిప్పు కణికలపై గోవిందా... గోవిందా... నామస్మరణ చేసుకుంటూ అగ్ని గుండ ప్రవేశం చేశారు. తిరుణాళ్ల కమిటీ సభ్యులు స్థానిక పోలీసుల సహకారంతో పటిష్ట చర్యలు చేపట్టారు. అనంతరం రుద్రకాళిక అమ్మవారి రూపం ధరించిన ద్రౌపదిదేవి ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

రెండు లారీల ఢీ: ముగ్గురికి తీవ్ర గాయాలు



రేణిగుంట సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మర్రిగుంట కూడలిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు... మేరకు రేణిగుంట, నాయుడుపేట ఆరు లేన్ల హైవేలో శ్రీకాళహస్తి వైపు వెళుతున్న లారీని వెనుక వస్తున్న కోళ్లను తరలిస్తున్న మినీ లారీ ఢీకొనింది. ఈ మినీ లారీ క్యాబిన్‌లో డ్రైవర్ సుబ్రహ్మణ్యం, క్లీనర్ విక్రమ్, సహాయకుడు సురేంద్ర ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న గాజులమండ్యం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని డ్రైవరు, సహాయకులను వెలుపలికి తీసి రూయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

ల్యాబ్ అసోసియేషన్ స్టేట్ అడ్వైజర్‌గా మురళి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ ప్రైవేటు మెడికల్ లాబోరేటరీ ఓనర్స్ ప్రొఫెషనల్ అసోసియేషన్ కార్యక్రమం శనివారం మంగళగిరిలోని ఆర్‌ఆర్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఇందులోభాగంగా స్టేట్ అడ్వైజర్‌గా శ్రీకాళహస్తిలోని ప్రభ క్లినికల్ ల్యాబ్స్ యజమాని పి.మురళినాయుడు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

మల్లంపల్లిలో చోరీ

ఏర్పేడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లంపల్లిలో రెండు ఇళ్లలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గజ్జల నాగరాజ, నారాయణమ్మ ఇళ్లల్లో రెండు సవర్ల బంగారు సరుడు, జత కమ్మలు, రెండు ఉంగరాలు మొత్తంగా మూడు సవర్లు బంగారు నగలు చోరీకి గురయ్యాయి. రెండు కుటుంబాల వారు వెంకటగిరి జాతరకు గురువారం వెళ్లి తిరిగి ఆదివారం ఇంటికి చేరుకున్నారు. తలుపులు తీసిఇళ్లల్లోకి వెళ్లి చూడగా బీరువాలో వస్తువులు చెల్లాచెదరుగా పడి ఉన్నట్లు గుర్తించారు. ఆదివారం సాయంత్రం ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్పీకర్లు, మంత్రులను కలిసిన ఎమ్మెల్యే ఆదిమూలం



సత్యవేడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి ఆదివారం విచ్చేసిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఏపీ శాశన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, హోంమంత్రి అనితను ఎమ్మెల్యే ఆదిమూలం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా స్పీకర్లు, మంత్రికి ఎమ్మెల్యే ఆదిమూలం పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని ఆదివారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఫైనాన్షియల్ ఆఫీసర్ అవినాష్ వసంత ప్రభు, అదే విధంగా బ్యాంకు ఆఫ్ బరోడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లలిత్‌త్యాగి, జనరల్ మేనేజర్లు రితేష్‌కుమార్, సీఎం త్రిపాఠి దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్దవేదపండితులు వారిని ఆశీర్వదించిస్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి గ్రీవెన్స్‌డే రద్దు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో జాతీయ మహిళ సాధికారత సదస్సు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు అందరూ సదస్సు నిర్వహణలో ఉన్న నేపథ్యంలో సోమవారం శ్రీకాళహస్తి, తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్లు తహసీల్దార్లు తెలిపారు.

ముక్కంటి క్షేత్రం... పోటెత్తిన భక్త జనం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తజనసంద్రంమైంది. వారాంతం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 29 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 325మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,872, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3.485మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,127మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,105, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 280, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 250, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 87మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,707 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న జేసీ

రేణిగుంట సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘనస్వాగతం లభించింది. తిరుపతిలో జరుగుతున్న జాతీయ మహిళ సాధికారిక సదస్సులో పాల్గొనడానికి ఆదివారం మధ్యాహ్నం విజయవాడ నుంచి ఆయన ఇండిగో విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనకు జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గం తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

ఏపీ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడికి సత్కారం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రవి రెండో సారి ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రిన్సిపాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి, కార్యదర్శి మాధవ నివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా శ్రీకాళహస్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రవి లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గ జంగమ సంక్షేమ సంఘం ఎన్నిక



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గ జంగమ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని పట్టణంలోని సంత మైదానంలోని అంకాళమ్మ ఆలయం వద్ద ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కారణి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడిగా గడ్డం లోకేష్‌ను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా సుబ్బరాయులు, తలమంచి చెంగయ్య, మైలాంగం సుబ్రహ్మణ్యం, చేజర్ల నాగభూషణం, తేరు రమణయ్య, కార్యదర్శిగా కారణి ఉదయ్ కిరణ్, ఉప కార్యదర్శిగా శ్రీలక్ష్మి, చెంగయ్య, కోశాధికారులుగా రేవూరు త్యాగమూర్తి, తలమంచి ప్రదీప్‌కుమార్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

లైసెన్సు తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పని సరిగా లైసెన్సు కలిగి ఉండాలని ఎస్‌ఐ విశ్వనాథనాయుడు చెప్పారు. స్థానిక చెక్‌పోస్టు సమీపంలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆటోలు, స్కూటర్లకు సంబంధించిన పత్రాలు, లైసెన్సు లేకుండా ఉన్న వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డులో ఇరువైపులా ఆటోలను నిలపడకుండా పాయింట్ దగ్గర నిలపాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బంది కలిగితే కేసుల నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రముఖులను కలిసిన ఎమ్మెల్యే సుధీర్





స్పీకర్ అయ్యన్నపాత్రుడిని ఆహ్వానిస్తూ... ఎంపీ పురందేశ్వరితో మాట్లాడుతూ...

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి వేదికగా తిరుచానూరు రోడ్డులోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ మహిళా సాధికారత సదస్సు జరగనుంది. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ అక్కడ ఏర్పాట్లను మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. అనంతరం పలువురు ప్రముఖులను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎంపీ పురందేశ్వరిని కలిశారు.

సమాచార హక్కు చట్టం బోర్డులో కనిపించని ఎంపీడీవో పేరు



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సమచార హక్కు చట్టం బోర్డులో ఎంపీడీవో పేరు గత రెండు సంవ్సత రాలు నుంచి కనబడడం లేదు. ప్ర భుత్వ కార్యాలయాల్లో జరిగే పనులు, ఇతర సమాచారం ప్రజలు పొంద డానికి సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చింది. ఇందుకోసం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో కార్యాలయ ముఖ్య అధికారి, సహాయ అధికారి పేరు, మొబైల్ నెంబరును కూడా కార్యాల య ముఖద్వారంలో ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంపీడీవోగా రవి కుమార్ నాయుడు పేరును రాశారు. పదోన్నతిపై ఆయన బదిలీ అయ్యారు. అప్పటినుంచి రెండేళ్లపాటు ఇన్‌చార్జి ఎంపీడీవోగా త్రివిక్రమ్ రావు కొనసాగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెగ్యులర్ ఎంపీడీవోగా వెంకటరత్నమ్మ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికీ ఆమె పేరును బోర్డులో మార్చక పోవడం గమనార్హం. ప్రస్తుతం ఎంపీడీవో శిక్షణకు వెళ్లడంతో ఇన్‌చార్జి ఎంపీడీవోగా మోతి బాధ్యతలు చేపట్టారు. సంబంధిత అధికారులు స్పందించి సమాచార హక్కు చట్టం బోర్డులో ఎంపీడీవో పేరు రాయాల్సి ఉంది.

గుండ్లకండ్రిగ పంచాయతీలో పక్కదారి పడుతున్న నిధులు

అధికారులకు తలనొప్పిగా మారిన సర్పంచ్ వ్యవహారం

బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

ఏర్పేడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లకండ్రిగ పంచాయతీలో ఉన్నది లేన్నట్టుగా... లేనిది ఉన్నట్లు సృష్టించి అక్కడి సర్పంచ్(వైసీపీ సానుభూతిపరుడు) పంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఎస్సీ కాలనీలో ప్రారంభించిన తాగునీటి బోర్లకు సైతం బిల్లులు పెట్టుకుని స్వాహా చేసినట్లు చెబుతున్నారు. నిధులు పక్కదారి పడుతుండడంతో పంచాయతీ అభివృద్ధి రోజురోజుకు కుంటుపడుతోందన్నారు. అంతేకాకుండా టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటికీ ఈ పంచాయతీలో నలుగురు పంచాయతీ కార్యదర్శులు ఆయన ఆగడాలు తట్టుకోలేక వెళ్లిపోయారున్నారు. ఎక్కడ పడితే అక్కడ సంతకాలు పెట్టమని సర్పంచ్‌వేధిస్తున్నట్లు పంచాయతీ అధికారులు చెబుతున్నారన్నారు. . ఈ క్రమంలో ఇక్కడ పనిచేయడానికి అధికారులు ముందుకు రావడంలేదన్నారు. ఇప్పటికే రూ.2.50లక్షల పంచాయతీ నిధులు పక్కదారి మళ్లించి స్వాహా చేసినట్లు చెబుతున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారించి సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముక్కంటి ఆలయంలో ఏర్పాట్ల పరిశీలన



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరుగుతున్న జాతీయ మహిళా సాధికారత సదస్సుకు హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శించుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎమ్మెల్యే సుధీర్, ఈవో బాపిరెడ్డి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి మహిళా ప్రజాప్రతినిధులు, పలువురు ముక్కంటి దర్శనం కోసం వస్తున్న నేపథ్యంలో వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.

శరన్నవ రాత్రి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కనకాచలం కొండపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవ రాత్రుల ఉత్సవాల పోస్టర్ల ఎమ్మెల్యే సుధీర్ ఆవిష్కరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవ రాత్రుల ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు కనకాచలం కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు జరుగుతాయన్నారు.

నిరుపయోగంగా వాటర్ ట్యాంకు



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లమాంబపురంలో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు నిరుపయోగంగా మారంది. గ్రామానికి తాగునీటిని సరఫరా చేయడానికి పది సంవత్సరాల క్రితం కేటీ రోడ్డు పక్కన ట్యాంకును నిర్మించారు. సమీపంలో తాగునీటి కోసం బోర్లు వేశారు. నీరు పడకపోవడంతో గ్రామానికి కిలోమీటరు దూరంలో బోరు వేసి పైపులైను ద్వారా ట్యాంకుకు అనుసంధానం చేశారు. అంతదూరం నుంచి నీరు ట్యాంకు ఎక్కపోవడంతో డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. విద్యుత్ సరఫరా లేని సమయంలో నీటికి తిప్పలు తప్పడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరో బోరు ఏర్పాటు చేసి ట్యాంకులోకి నీరు ఎక్కించి సరఫరా చేయాలని కోరుతున్నారు.

బోరుకు మరమ్మతులు చేపట్టండి



మరమ్మతులకు గురైన కోవనూరు ఎస్టీకాలనీలోని చేతిబోరు

కేవీబీపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవనూరు ఎస్టీకాలనీలో తాగునీటి చేతిబోరు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. పైపు తుప్పు పట్టి రంధ్రాలు పడినా మరమ్మతులు చేపట్టడం లేదని వాపోయారు. ఇప్పటికి పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదన్నారు. కాగా ఈ చేతిబోరే కాలనీవాసుల దాహార్తి తీరుస్తోంది. బోరు మరమ్మతులకు గురికావడంతో వేరేప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేయించాల్సి ఉంది.

విద్యా సామగ్రి పంపిణీ



ఏర్పేడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ మేళా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. పల్లం, పంగూరు, వాంపల్లి, వెలంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు 60మందికి విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గోవర్ధన్, సంస్థ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, పంగూరు, పల్లం పాఠశాలల హెచ్‌ఎంలు రామచంద్ర, ఆనంద్, ఉపాధ్యాయులు చంద్రయ్య, తులసికుమార్, శేఖర్, ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అపుస్మా

500మంది టీచర్లకు పురస్కారం



ఎంపీ, ఎమ్మెల్యేలతో పురస్కార గ్రహీతలు

తిరుపతి రూరల్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా)కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. చిగురువాడలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం రాయలసీమ జోన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 500మందికి పురస్కారం, మెమెంటోలను అందజేశారు. రాయలసీమ 8 జిల్లాలతో పాటు సంఖ్యాపరంగా 500మంది టీచర్లకు ఒకేసారి అవార్డులను అందించి రికార్డు నమోదు చేశామని తెలుగు బుక్ రికార్డ్స్ ప్రతినిధులు డాక్టర్ సి.నారాయణస్వామి, శరత్‌చంద్ర పేర్కొన్నారు.ముఖ్యఅతిథులుగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తినాని, కలికిరి మురళీమోహన్, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి నుంచి అపుస్మా రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు ఈ పురస్కారాల్ని అందుకున్నారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో ఆవిష్కరణలు రూపొందించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఏపీ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ ఎం.సుగుణమ్మ, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, డీఈవో కేవీఎన్ కుమార్, అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు కె.తులసీవిష్ణుప్రసాద్, రాయలసీమ జోన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి, నాయకులు డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, వీవీ రమణారెడ్డి, కేఎస్ వాసు, బి.రవీంద్రారెడ్డి, సింగరాజు భాస్కర్‌రాజు, రెడ్డి శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.